తృష్ణ ముళ్ళు

శ్రీ 'విజయ - రాఘవ'

★

(గతసంచిక తరువాయి)

"మల్లిఖార్జునరావుగారూ! యిదంతా మా భ్రమగాని, మరేముంది చెప్పండి. చాలా శ్రమ కలిగించా. మీ రటువంటివారు కాదని 'మాట వరసకి యినస్పెక్టర్ గారితో అన్నాను. కాని డ్యూటీ గదండీ! తప్పుతుందా! చేసినట్లు ఒక రిపోర్టు కూడా పంపాలిగదా! అందువల్ల వచ్చాం.' మీకు అనవసరంగా శ్రమ కలిగించినందుకు వేరుగా అనుకోకండి. వెళ్లొస్తాం" అంటూ నెత్తిమీద టోపీ పెట్టుకొని, సాల్యూట్ చేసి గది మెట్లుదిగి వెడుతుంటే, మెట్లమీద నిలుచుండి మల్లిఖార్జునరావు - "అయితే వుంటా సార్" అని గదిలోకివచ్చి తలుపులుమూసి, తీసిపార వేద్దామన్నా తీయడానికి వీలుగాని అపవాదు యిలా వచ్చిందేమి!" అని ఆలోచిస్తూ పడుకొన్నాడు.

ఈ పోలీసువాళ్ళు రావడం, మల్లిఖార్జునరావు, కానిస్టేబుల్ కలిసి వేరుగాపోయి మాట్లాడుకోవడం, తరువాత వచ్చి రూం అంతా సోదా చేయడం, తరువాత కానిస్టేబుల్ అన్న ఆఖరి మాటలు, యీ తతంగమంతా పరిశీలిస్తున్న స్నేహితుడుకి అంతా అయోమయంగావుంది. అంధకారంలో పాతాళ లోకం కనిపిస్తున్నట్లుంది.

"దేనికండీ వచ్చారు వీళ్ళంతా" - స్నేహితుడు వుండబట్టలేక అడిగాడు. మల్లిఖార్జునరావేమి సమాధానం యిస్తాడు. మళ్ళా కొరడాపెట్టి కొట్టినట్లయింది. మొగమంతా జీవురు మంటోంది. "తరువాత నెమ్మదిగా చెప్తాలెండి" అని మల్లిఖార్జునరావు గోడ ప్రక్కకు తిరిగి పడుకొని బీడీకాలుస్తూ సరోజినిని గురించి ఆలోచిస్తూ - కన్ను రెప్పలకి నిద్ర నంటించాడు.

7

గొల్లపల్లిలో బ్రహ్మాజీరావు యింటిముందు ఒక కమ్మవారి కుటుంబంవుంది. ఒకానొకప్పుడు ఒకరికొకరు చాలా సన్నిహితంగా వుంటూవచ్చినవారే. రోజులు మారుతున్నకొద్దీ బుద్ధులు మారుతూండటం జరుగుతోంది. మొదట్నించి సత్యవతి - సరోజిని - రావమ్మ ఒకే తరగతిలో వుండటంబట్టి, వారంటే ప్రతివారూ చాలా వరకు జాగ్రత్తగానే వుంటూ వుంటారు. సత్యవతి - సరోజినులకు చేతిగ్రతనం వుంది. చిన్నతనంలో పుట్టిన బుద్ధిని అప్పుడే మొదట్లోనే తుంచినట్లయితే యీనాడు యింత అఘాయిత్యానికి కారకురాలు కాకుండాపోయేది. కడసారి కూతురవడం - గారాబాల మొలకవడంతో - గౌరవమర్యాదలకు గంధకం పూత వేస్తోంది. సరోజిని సత్యవతుల్లో ఎవరు గొప్పని నిర్ణయించడానికి మనమెవరం? బహుశా! వూహించినా తప్పేనంటూ నన్నడిగితే. ఎందుకంటే యీ ప్రపంచంలో యింతో, అంతో జ్ఞానమార్జించుకొని, కాలాన్ని వెళ్ళబుచ్చుకొంటున్న వాళ్ళం. యీనాడు వాళ్ళిద్దర్నీ గురించి కాలయాపనచేస్తూ, ఆలోచించడానికి ఉద్యమించామంటే కేవలం కొరివితో నెత్తిగోక్కున్నట్లవుతుంది. ఎడారిలో గుడారంవదిలి ఎండమావుల కోసం, గుండెకు రాయి కట్టుకొని తిరగటం అవుతుంది.

"ఆ కమ్మవారు వున్నట్టుండి కట్టకట్టుకొని అంతా పెళ్ళికెళ్లారు. సరోజిని ఆ సమయంలో వాళ్ళింటి పాలేరుతో యేంమంతనాలాడిందో పెరుమాళ్ళకెరుక. తెల్లవారేటప్పటికి పెళ్ళి కెళ్ళినవారు తిరిగివచ్చి

యిల్లు చూసుకొంటే యేముంది? గుల్లగా తయారయివుంది. లబాయిలు దిబాయిలు, ఏడుపులు - పెడబొబ్బలు. నెమ్మదిమీద యోచనచేసి, యెలాగైతేనేం విషయాన్నంతా ఆకళింపుచేసుకొని పోలీసు రిపోర్టుచేయడం - వాళ్లొచ్చి, బ్రహ్మాజీరావు యిల్లు సోదాచేయడం, సరోజినివున్న గదిలోనే పోయిన వస్తువులు దొరకడం జరిగింది. వస్తువులు దొరకటం వల్ల కేసుకు బలం బాగా వచ్చింది. సరోజిని యీ రాద్ధాంతానికి కారకురాలని నిశ్చయించారు. ఇంత హంగామా జరిగిన సమయంలో బ్రహ్మాజీరావు యెక్కడో హాయిగా అమాయకుల దగ్గర డబ్బాలు కొడుతున్నాడు. వూళ్ళో అయితే లేడని కచ్చితంగా తేలిపోయింది. తీరా కారుదిగి యింటికొచ్చేటప్పటికి సరోజిని యెరగనట్టువుంది. ఆ సాయంత్రం మామూలుగా పోసుకోలు కబుర్లరాయళ్ళంతా రావిచెట్టు అరుగుమీద కూర్చొని మాట్లాడుతూండగా - సరోజినిచేసిన అఘాయిత్యం కాస్త కాస్తగా బయలుకు రాసాగింది. బ్రహ్మాజీరావు సాంతం సానుకూలంగావిని నివ్వెరపోయాడు. తన యెడమకాలి చెప్పుతో తనను ఎవరో తీర్చి కొట్టినట్లుగావుంది. వేయి శూలాలతో వొళ్ళంతా పొడుచినట్లు బాధపడసాగాడు. ఏంచేస్తాడు. నోటమాటలేదు. ప్రొద్దుకూకిపోయింది. తిండి తిప్పలకు యెవరికివాళ్ళు లేచి వెళ్ళిపోతున్నారు. పంచె దులుపుకొంటూ బ్రహ్మాజీరావులేచి, కాళ్లీడ్చుకొంటూ యింటి ముఖం పట్టాడు. సరోజిని వంట చేస్తోంది. బ్రహ్మాజీరావుకి యేమని ప్రశ్నించి, యీ విషయంలో నిజానిజాలు తెలుసుకోవాలో అగమ్యగోచరంగావుంది. అందులో గౌరవంగా బ్రతికినవ్యక్తి ఒకప్పుడు. చూస్తూ, చూస్తూ తనేవిధంగా అప్రతిష్ఠలకులోనయిపోతున్నాడో వూహించుకోనవసరంలేకుండానే చర్యలన్నీ చత్వారం వచ్చిన కళ్ళకే - స్పష్టంగా కనబడుతుంటే, వేరే తనెందుకు సులోచనాలకోసం బాధపడాలి. అయినా సరోజినిని అడిగి తెలుసుకోవాలని అనుకొన్నాడు.

"సరోజినీ! యేమిటిదంతా! వూరంతా కోడై యేమని కూస్తోందో విన్నావా!"

"అనుకుంటే అనుకుందిలే. నాకేమన్నా భయమా! యెవర్నీ గురించి యేమనుకోకుండా యెవరూరుకొంటారు. అయినా వాళ్ళు చూసారా నేతీయడం"-

"తీయకపోతే యీ అభాండం యింత తేలిగ్గా మనమీద యెందుకు వేస్తారు. పోనీ వాళ్ళకేమైనా సరదా అనడానికి."

"సరదో - గిరదో నాకేం తెలియదు. నేనెటువంటిదాన్నో నీకు తెలియదా!"

"తెలుసు. కాని, చీరెలు - నగలూ మనింట్లో యీ గదిలోనే దొరికాయటగా!"

"నాకు తెలియకుండావస్తే రాకూడదా! నేనే నూతికి. గోతికి పోయినప్పుడో, వాళ్ళ పాలేరువాడు యీ పనిచేస్తే, చేయకూడదా! అయినా, వాళ్లు మాత్రం పెట్టెలకు తాళాలు వెయ్యకుండా వెళ్ళికి పోవడంయేమిటి? ఖరీదైన వస్తువు కంటబడితే, కావాలని తీసుకోకుండా యెవరుంటారు యీ రోజుల్లో.

"కంటబడితే బుద్ధి గడ్డితినాలుందేమిటి?"

"గడ్డితినకుండా కాలం వెళ్ళబుచ్చుతున్న వాళ్లెవరేమిటి?"

"మనిషి జన్మెత్తిం తరువాత బుద్ధి వుండాలి. వెధవ సమాధానాలు చెప్పినంత మాత్రాన అది సరిపోదు. అదేదో తెలివనుకుంటున్నావ్ గాని. నిజంగా యింత అపవాదు, నేను బ్రతికివుండగా తెచ్చి నా నెత్తిమీద కిరీటంగా పెట్టావంటే, యింకేమనుకోవాలి. నా పరువు ప్రతిష్ఠలు మట్టిలో కలిపావు. వీధిలో తలెత్తుకోనీయకుండా చేసావ్! నలుగురిలో నా మాటకు చలామణీ లేకుండా చేసావ్. పదిమందిలో కూర్చొంటానికి, వాళ్ళతో కలిసి తిరగడానికి ఆస్కారంలేకుండా చేసావ్. చిన్నప్పుడే - మీ అమ్మ బ్రతికివున్నప్పుడే నీ బుద్ధి నాకర్థమయింది. ఆయేడు

"తూ" అని పుసిక్కున వూసేవాళ్ళేగా! అయినా తుమ్మవల్ల ప్రయోజనం లేదనిగాదు. ప్రకృతిలో ప్రయోజనం లేని వస్తువులేదు. తుమ్మలంటే జ్ఞాపకం వస్తుంది పాతసామెత ఒకటి. ఒక్కొక్కసారి మన పెద్ద వాళ్ళు ఎవరినన్నా తిట్టుతున్నప్పుడు, అక్కడక్కడా ముద్దు ముద్దుగా, "ముచ్చటగా నీ మొహమేగా! నాయనా! తుమ్మల్లో ప్రొద్దుకూకినట్టుంది." అని అంటూంటారు. మూడు సంవత్సరాల్లో మేకలు తినకుండా ఆ తుమ్మలెలాగైతేనేం పెద్దవైనాయి. క్రింద కొమ్మల్ని నరికి సుబ్బారావు రెండో కొడుకు యింటికిచుట్టూ కంచె వేస్తూవస్తున్నాడు. బ్రహ్మాజీరావు స్థలంల్లో చెట్లు అలాగే వున్నాయి. సుబ్బారావు కున్నంత పెరడు దొడ్డి; రంగారావుకి లేదు. సత్యవతికి కడుపు కాలుకుపోతుండేది, సుబ్బారావు పెరటిదొడ్లో కూరగాయిలు — పూల మొక్కల్ని చూచినప్పుడల్లా. చీటికి మాటికి వచ్చినప్పుడల్లా సత్యవతికి కన్నుకొట్టి, యేం మాట్లాడాలో తెలియక- "అక్కాయ్! మీరేంయమే! చక్కగా దొడ్లో పాదులన్నీ పెట్టావ్. మాకూ స్థలమున్నదన్న మాటేగాని, యేంలాభం. పెట్టుకొని పెంచుకొనే దశ వుండొద్దు. మీరేనయం - మీరేనయం" అని పదే పదే దొడ్డంతా తిరుగుతూ, చుప్పనాతి సూడిలాగా మాట్లాడుతూంటే, అలివేలమంగకి అంతరాంతరాల అఘాతంలోంచి ఆవేశాన్ని, ఎవరో గొట్టాలుపెట్టి విద్యుచ్ఛక్తితో, తోడినట్లుగా వుండేది. "అవేం మాటలే ... మరీను. అల్లా అంటావ్. నీకూ స్థలముందిగా - నువ్వూ పెట్టకోగూడదా" అంటే అనవసరంగా దాన్ని బాధపెట్టినదాన్ని అవుతానేమో అని అభిమానం ఒకటి పీడిస్తోంది. "చూసావా! చూస్తూ, చూస్తూ అక్కయ్యని చనువుగా మాట్లాడితే, నిర్మొహమాటంగా పుటిక్కున మొహాన అనేసింది" అని యెక్కడ క్రుంగిపోతుందో అని భయపడేది. అలివేలమంగ కొడుకులచేత దొడ్డికి కంపవేయించుకొనేది. యింత బందోబస్తు సత్యవతి స్థలానికిలేదు. వున్న కాస్తలో పూల మొక్కలు పెట్టింది. సుబ్బారావు యింటిముందు పూలమొక్కలు కొడుకుల పోషణవల్ల కంటికి విందొనరిస్తుంటే, తనకెందుకలా చేయలేనని, పోటీగాచేసిన కృత్యమని నోరు చెప్పకపోయినా స్వయంగా, చేతల్లో నగ్నసత్యం బయట పడకుండా యెన్నాళ్లు దాగివుంటుంది. సమయాసమయ విచక్షణాజ్ఞానం లేకపోతేనూ, చిన్నా-పెద్దా, తారతమ్యత లేకుండా నోటికిష్టమొచ్చినట్టు అభమూ-శుభమూ యెరుగకుండా వాగుతున్నప్పుడు అయినవాళ్లు మాత్రం చూస్తూ యెలా వూరుకోగలరు! అలివేలమంగంటే, రక్తసంబంధమైన అక్కగారు. చిన్నతనంలోనే అవగాహనైనబుద్ధి. అందువలన "చెల్లెలు" అనే పదం హృదయంలో తళుక్కుమన్నప్పుడు సత్యవతి నోరుచేసుకొన్నా యేం అనుకునేదిగాదు.

9

సరోజినిని యీనాడు కాపురానికి పంపితే తనకు ఒండిపెట్టేవాళ్లు ఎవరూ వుండరని బ్రహ్మాజీరావు పరిపరి విధాలుగా ఆలోచిస్తూనే వున్నాడు. ఎన్నాళ్ళని పెళ్ళయిన పిల్లని తిరిగి కాపురానికి పంపకుండా వుంటాడు. యిప్పటికే లోకులు పలుకాకుల్లాగా కూస్తుంటే, తను స్వయంగావింటూ యేంచెయ్యలేకపోతున్నాడు. ఎలాగో పంపేద్దామనే ధృఢనిశ్చయుడయ్యాడు. సరోజిని తిరిగి కాపురానికి వెళ్ళిందని పదిమంది అమ్మలక్కలు అనుకొన్నారు. మహాఅయితే యే రెండు మూడు నెలలు మొదటిసారి అత్తవారింట కాపురం యెలగ పెట్టింది; అప్పట్లోనే మల్లిఖార్జునరావు ట్రైనింగ్ చదవడానికి వెళ్ళింది. మల్లిఖార్జునరావు చాలా రోజులు బాగా ఆలోచించే ట్రైనింగ్‌లో చేరింది. బ్రహ్మాజీరావు చాలా ఆశలు చూపాడు, మల్లిఖార్జునరావు ట్రైనింగ్‌లో చేరకముందు. ఆ వుద్యోగం యిప్పిస్తా, యీ వుద్యోగం యిప్పిస్తా, అందులో నాకు తెలిసిన వాళ్లున్నారు, యిందులో వున్నారని బూటకపు మాటలతో పేకమేడలు కట్టడంలోగల అంతరార్థం గ్రహించి, తనకీయన మొండిచెయ్యి చూపుతున్నాడని తెలుసుకొని, బృహస్పతి తెలివితేటలుపయోగించి ట్రైనింగులోకిచేరాడు. తన అల్లుడు పనికిమాలిన ట్రైనింగు చదువుతున్నాడని బ్రహ్మాజీరావు ఒక

రిద్దరు వుప్పొంగి పత్నులతో అన్నాడు. అంతటితో వూరుకోక తనకు తీరని అవమానంగాకూడా వుందన్నాడు. "ఫలానా బ్రహ్మాజీరావు అల్లుడు ట్రైనింగ్ చదువుతున్నాడంటే తనెంత సిగ్గుపడి చావాలి. ఇంత గౌరవంగా బ్రతికిన బ్రహ్మాజీరావు, కూతుర్నిచ్చి పెళ్ళిచేసి కావాలని తెచ్చుకొన్న అలుడు మల్లిఖార్జునరావుకి వుద్యోగం సంపాదించి పెట్టలేకపోయాడే అనే అప్రతిష్ఠ తనకు రాదూ! యిలా అప్రతిష్ఠ వస్తుందని మల్లిఖార్జునరావు యిసుమంతైనా గ్రహించలేకపోయాడే! ఎంత తెలివి తక్కువవాడు" అని ఖేదపడిన రోజులు బ్రహ్మాజీరావు బ్రతుకు చిట్టాలో ఎర్ర సిరాతో అండర్‌లైను చేసేవున్నాయి.

బ్రహ్మాజీరావు చేసిన పనులన్నీ ప్రసాదరావుకి ఆలోచిద్దామన్నా పాలుపోకుండా తయారైనవి. ప్రసాదరావును అతని బంధువులేగాదు, అతని మొగం చూసిన ప్రతివాడు యింతో అంతో గౌరవం - ప్రేమ చూపించకుండా వుండలేడు. ప్రసాదరావు ఎన్నో విధాలుగా గొల్లపల్లి యెస్టేటును పతనాలకు గురికాకుండా కాపాడుకొంటూ వచ్చాడు. యెన్నో ఘనకార్యాలుచేస్తూ దాని ఘనతను నిలబెడుతూ వచ్చాడు. యీ నాటికి గొల్లపల్లి యెస్టేటు జమిందారు బంధువులేగాని, ఆయన కూతుళ్ళుగాని ప్రసాదరావు పేరు రోజుకి ఒక సారైనా స్మరించకుండా వుండలేరు. ప్రసాదరావు యెంత దూర్వాసమహామునో, ఆయన భార్య నరసమ్మ అంత శాంత స్వభావురాలు. "అన్నపూర్ణ" అనికూడా నిస్సంకోచంగా అనొచ్చు. ఎప్పుడు వెళ్ళినా అతిథులకు అడ్డులేదు. శక్తివంచనలేకుండా ఒక్కచేతిమీద చేసిపెట్టే మనిషి. చిరునవ్వులతో ఆహ్వాన వీడ్కోలు జరుపుతూండేది. యీ నాటికి ప్రసాదరావు సంసారాన్ని వేనోళ్ళ పొగడుతున్న ఛత్రాజులూ - గొల్ల భాగవతులు కనిపిస్తూనేవుంటారు. ప్రసాదరావుకి యిద్దరు మొగపిల్లలు, యిద్దరాడపిల్లలు. ప్రసాదరావు, నరసమ్మ కలిసి పెద్దపిల్ల చిట్టిని సుబ్బారావు పెద్దకొడుక్కిచ్చి వివాహం చేయాలనుకొన్నారు. కాని యిద్దరికీ ఒకే వయసులో వివాహంచేయడం యేంబాగుంటుందని అభిప్రాయాన్ని మార్చుకొన్నారు. చిట్టిని పరాయిగా వేరే సంబంధంచూసి పెళ్ళిచేసారు. యిస్తానని యెగగొట్టాడని సుబ్బారావు యేమాత్రం చింతించలేదు, బాధపడలేదు. చివరకు గొనగనూలేదు. కాని చిట్టెమ్మ వివాహానంతరం పెద్ద కొడుకు వివాహంచేసిన మరు క్షణంలోనే నరసమ్మ స్వర్గస్తురాలయింది. యీ చావు రాబోతోందని యేమైనా వూహించదేమో మరి ఆ పతివ్రత నరసమ్మ. ఒకనాటి వుదయం పెద్ద కొడుకు పెళ్ళిలో సుబ్బారావు దంపతుల్ని చేరబిలిచి ప్రసాదరావుకూడా అక్కడే వున్నాడు. వంటయింటిముందు పందిట్లో కూర్చోపెట్టి - నరసమ్మ -,

"సుబ్బారావూ! - యేం అనుకోకుండా వుంటానంటే, ఒక మాట చెబుదామనుకొంటున్నా. మరి మీ బావకూడా యేమంటారో కనుక్కోవాలిగా" - అంది.

సుబ్బారావు దంపతులు సౌమ్యంగా—

"అనుకునేదేముంది అక్కయ్యా! చెప్పదల్చుకొన్నదేమిటో చెప్పండి" - అన్నారు.

నరసమ్మ పమిటచెంగు ముడివేస్తూ — "యేమీ లేదు. చిట్టినిద్దామని అనుకున్నాం. కాని అది జరుగకుండాపోయింది. దాన్ని గురించి యిప్పుడా విషయం అనవసరంకూడా. ఎలాగైనా యీ సారి మీతో వియ్యమొందాలని, సంబంధ బాంధవ్యాలు యిదివరకటికన్నా యెక్కువ చేసుకోవాలనివుంది. నా రెండో అమ్మాయిని మీ వాడికిచ్చి సలక్షణంగా వివాహం చెయ్యాలనివుంది. మీ అన్నయ్యకికూడా యిష్టమేననుకుంటా. యీ విషయం మీరుకూడా యిష్టపడినట్లు, యీ పందిట్లోనే వివాహం జరిగేటట్లు "ఊ..." అని వొప్పుకున్నట్లు వాగ్దానం చెయ్యండి" అని చేతిలో చేయివేయించుకొని అమృత ప్రాయంగా మాట్లాడేటప్పటికి సుబ్బారావు దంపతులుకి ఒళ్లు పులకరించిపోయినట్లయింది.

(సశేషము)